# పల్లె వెలుగు పలకరించేనా?



దంతేపల్లి గిరిజన తండాకు కేసీఆర్ ప్రభుత్వం వేసిన రోడ్డు



దంతేపల్లి నుంచి కాలినడకన వస్తున్న విద్యార్థులు



చల్మెడ గ్రామం నుంచి రోడ్డు వరకు కాలినడకన విద్యార్థులు

- పల్లె ప్రాంతాలకు బస్సుల్లేక ప్రజల ఇబ్బందులు
- బస్సు కోసం మైళ్ల దూరం విద్యార్థుల కాలినడక
- కొన్ని ప్రాంతాలకు ఉదయం, సాయంత్రం ఒక్కటే బస్సు
- బస్సులు నడపాలని కోరినా అధికారుల స్పందన కరువు

రామాయంపేట, జనవరి 1: గతమెంతో ఘనం.. ప్రస్తుతం శూన్యం అన్న చందాన తయారైంది పల్లె వెలుగు బస్సుల పరిస్థితి. దశాబ్దాలు గడిచినా మారని గిరిజన పల్లె ప్రాంతాల్లో తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం రోడ్డు సౌకర్యం కల్పించింది. దాంతో పాటు పల్లె వెలుగు బస్సులనూ సమయానుకూలంగా నడిపింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో పల్లె వెలుగు బస్సులు కనబడటంలేదు. దీంతో తమ గ్రామాలు, తండాల నుంచి వేరే ప్రాంతాలకు వెళ్లడానికి గిరిజన ప్రాంతాల ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తున్నది. విద్యార్థులు కాలినడకన మైళ్ల దూరం నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది.

### కాలినడకనే వారి ప్రయాణం

రామాయంపేట ఉమ్మడి మండలంలోని మారుమూల ప్రాంతాలైన దంతేపల్లి, సదాశివనగర్, కాట్రియాల, చల్మెడ, తిప్పనగుల్ల, రజాక్‌పల్లి, సుతారిపల్లి, కల్వకుంట, నార్లాపూర్, బచ్చరాజుపల్లి, శివ్వాయిపల్లి, జెడ్‌చెర్వు, పర్వతాపూర్, నగరం గిరిజన తండాల నుంచి రోజూ చదువుకోవడానికి వందలాది మంది విద్యార్థులు తరలివెళ్తుంటారు. తమ గ్రామాల నుంచి సుమారు ఎనిమిది నుంచి పది కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలు వెచ్చించి రామాయంపేట ఎమ్మెల్యేగా, డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న పద్మాదేవేందర్‌రెడ్డి కృషితో పల్లె ప్రాంతాలు, గిరిజన తండాలకు రోడ్లు బాగు వేశారు. అప్పట్లో సరిపోయే బస్సులు కూడా నడిపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్రీ బస్సు పేరిట పల్లె ప్రాంతాలకు ఉన్న బస్సు సౌకర్యాన్ని దూరం చేసింది. ఒక బస్సు ఉదయం, సాయంత్రం వచ్చి వెళ్తుంటుంది. గతంలో గంటల వ్యవధితో నడిచే బస్సులు ప్రస్తుతం ఒకటో రెండో సార్లు పల్లెను పలకరిస్తున్నాయి. దీంతో అందులో ఎంతమంది అయినా ఎక్కాలి. లేదంటే వేరే ప్రయాణ సౌకర్యం లేనందుకు కాలినడకన వెళ్లాల్సి ఉంటుంది.

### బస్సులు రాకుంటే కాలినడక తప్పదు



గతంలో రోడ్లు బాగులేక చదువు కోసం మైళ్ల దూరం కాలినడకన వెళ్లేది. ప్రస్తుతం రోడ్లు బాగానే ఉన్నాయి. కాని బస్సులు మాత్రం రావడంలేదు. ఇప్పుడున్న వాటికంటే అదనంగా మారుమూల ప్రాంతాలకు బస్సులు వేస్తే మా చదువులు చక్కగా సాగుతాయి.

**- అరవింద్, పదోతరగతి, పర్వతాపూర్**

### చదవాలంటే కష్టపడక తప్పదు



చదవాలంటే కష్టపడక తప్పదు. కేసీఆర్ సార్ మా గ్రామాలకు రోడ్లు వేశారు. కేసీఆర్ సార్ ప్రభుత్వంలోనే బస్సులు బాగా నడిచాయి. ప్రస్తుతం బస్సులు సరిగా రావడం లేదు. దీంతో వచ్చే ఒక్క బస్సుకోసం తెల్లవారు జామున నిద్రలేవాలి. ఏడు గంటలకు బస్సు అందుకోవాలి. లేకుంటే ఆ రోజు మా స్కూల డుమ్మా అన్నట్లే. అదనంగా బస్సులు నడపాలి.

**- ప్రశాంత్, శ్రీకాంత్, విద్యార్థులు, చల్మెడ**

# సీఎంఆర్‌ఎఫ్ వరంలాంటిది: ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



కౌడిపల్లి: లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి



నర్సాపూర్: నాగులపల్లిలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న మాజీ సర్పంచ్‌లు



రామాయంపేట: కాట్రియాల గ్రామంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందిస్తున్న కార్యకర్తలు

కౌడిపల్లి, జనవరి 1: నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరంలాంటిదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని తిమ్మపూర్ గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.2,32,000ల చెక్కులను బీఆర్‌ఎస్ నాయకుడు సార కిశోర్‌గౌడ్‌కు హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆమె అందజేశారు. కార్యాక్రమంలో సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ ప్రతాప్‌గౌడ్, పలువురు ఉన్నారు.

### నర్సాపూర్‌లో..

నర్సాపూర్, జనవరి 1: మండలంలోని నాగులపల్లి గ్రామానికి చెందిన తాళ్ల లలితకు ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి సహకారంతో మాజీ సర్పంచ్‌లు జీవన్‌రెడ్డి, సేనాధిపతి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బుధవారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యూత్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, నాయకులు ముకుందం రెడ్డి, జలీల్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

### రామాయంపేటలో..

రామాయంపేట, జనవరి 1: మండలంలోని కాట్రియాల గ్రామానికి చెందిన జస్వంత్‌రెడ్డికి రూ.44 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏడుపాయల్లో భక్తుల ప్రత్యేక పూజలు



దుర్గామాతను దర్శించుకున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



పూజలందుకుంటున్న దుర్గామాత అమ్మవారు



ఏడుపాయల వనదుర్గామాత సన్నిధిలో భక్తులు

### దుర్గామాతను దర్శించుకున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పాపన్నపేట, జనవరి 1: ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని ఏడుపాయల వనదుర్గామాత ఆలయంలో బుధవారం పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. 2025వ సంవత్సరంలోకి అడుగిడిన సందర్భంగా ఆయా ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా ఏడుపాయలకు చేరుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా నుంచే కాకుండా పొరుగు రాష్ట్ర, రాష్ట్రేతర భక్తులు కూడా తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. భకులు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు చేశభూరు. కలెక్టర్ రాహుల్‌రాజ్ దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయనకు ఈవో చంద్రశేఖర్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక అర్చన, పూజలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను ఈవో చంద్రశేఖర్ శాలువతో సత్కరించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తుల రాక సందర్భంగా ఆలయ సిబ్బంది భారీగా ఏర్పాట్లు చేశారు. వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడుపాయల్లో ఎలాంటి ఘటనలు జరగకుండా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ బందోబస్తు చేపట్టారు.

# సబ్సిడీ సిలిండర్లు పక్కదారి!



- వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ అమ్మకం
- అక్రమార్జనే ధ్యేయంగా డీలర్ల ఎత్తులు
- దర్జాగా డెలివరీ బాయ్స్ అదనపు వసూళ్లు
- నిమ్మకు నీరెత్తిన పౌర సరఫరాల శాఖ



### మెదక్ జిల్లాలో ఇలా..

| | |
|---|---|
| గ్యాస్ ఏజెన్సీలు | 17 |
| డొమెస్టిక్ కనెక్షన్లు | 108688 |
| దీపం పథకం | 63161 |
| ఉజ్వల పథకం | 33618 |
| సీఎస్‌ఆర్ | 29485 |
| కమర్షియల్ | 460 |
| మొత్తం కనెన్షన్లు | 235412 |

మెదక్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): జిల్లాలో గ్యాస్ సిలిండర్ల దందా యథేచ్ఛగా సాగుతున్నది. డీలర్లు వినియోగదారుల పేరిట సిలిండర్లు బుక్ చేసుకుని ఇతరులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వినియోగదారులకు సబ్సిడీ జమ అవుతున్నా.. సిలిండర్లను డీలర్లు ఇతరులకు అధిక ధరకు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. మరో వైపు గృహ అవసరాల సిలిండర్లను హోటళ్లు, వాణిజ్య సంస్థలకు చేరవేస్తున్నారు. డెలివరీ బాయ్స్ అదనపు వసూళ్లకు పాల్పడుతు, వినియోగదారులను నిండా ముంచుతున్నారు. పౌర సరఫరాల సంస్థల అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ఇష్టారాజ్యంగా గ్యాస్ దందా!

వాణిజ్య అవసరాల కోసం డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ వినియోగించడానికి వీలులేదు. కానీ వాణిజ్య సిలిండర్ల ధర ఎక్కువగా ఉండడాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు డీలర్లు హోటళ్లకు డొమెస్టిక్ సిలిండర్లు సరఫరా చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో విచ్చలవిడిగా టిఫిన్ సెంటర్లు వెలిశాయి. ఆ టిఫిన్ సెంటర్లు మొదలు హోటళ్లు, రెస్టారెంట్లలో ఈ సిలిండర్లే ఎక్కువగా వినియోగిస్తున్నారు. మహాలక్ష్మీ పథకం కింద లబ్ధిదారులకు రూ.500కే సిలిండర్ వస్తుండడం, కొందరు ఏటా రెండు నుంచి మూడు మాత్రమే వాడుతుండడంతో వారి పేరిట సిలిండర్లు బుక్ చేసి వాణిజ్య అవసరాలకు మళ్లించి, డీలర్లు సొమ్ము చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.

### దృష్టి సారించని పౌర సరఫరాల శాఖ

జిల్లా వ్యాప్తంగా గ్యాస్ సిలిండర్ల దందా యథేచ్ఛగా సాగుతున్నా పౌర సరఫరాల సంస్థ అధికారులు మాత్రం దృష్టి సారించడంలేదు. డీలర్లు లెక్కా పత్రం లేకుండా డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు విక్రయిస్తున్నారు. ఇంత తతంగం జరిగినా తనిఖీల మాటెత్తడం లేదు. ఇటు గ్యాస్ గోదాముల్లో కానీ అటు ఏజెన్సీల్లో కానీ తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. ఇదే అదనుగా భావిస్తున్న డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అడ్డూ అదుపు లేకుండా తమ దందాను కొనసాగుతున్నారు.

### వసూలు రాజాలుగా డెలివరీ బాయ్‌లు

సిలిండర్లు డెలివరీ చేసే సిబ్బంది తమవంతుగా వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నారు. 5 కిలోమీటర్ల వరకు సిలిండర్‌ను ఉచితంగా డోర్ డెలివరీ చేయాలి. 30 కి.మీ అయితే రూ.10, అంతకు మించి దూరమైతే రూ.15 వసూలు చేసుకోవచ్చు. సిలిండర్ తీసుకొస్తే మినిమం రూ.20 నుంచి రూ.30 వసూలు చేస్తున్నారు. అదే ఇంటి ఫస్ట్ ఫ్లోర్ అయితే రూ.40 నుంచి 70 వరకు వసూలు చేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే మళ్లీ సిలిండర్ తీసుకురావాలా వద్దా అని బెదిరింపులకు పాల్పడుతున్నారు. వీరిపై ఏజన్సీ వారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

### తనిఖీలు చేస్తున్నాం



పౌర సరఫరాల శాఖలో సిబ్బంది కొరత ఉంది. వారం పది రోజుల్లో డిప్యూటీ తహసీల్దార్లు వస్తున్నారు. గ్యాస్ గోదాములు, గ్యాస్ ఏజెన్సీల్లో తనిఖీలు చేపడుతాం. డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడకుండా తనిఖీలు చేస్తున్నాం. ప్రభుత్వ నిబంధనల మేరకు గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులకు సిలిండర్లు సరఫరా చేయాలి.

**- సురేశ్‌రెడ్డి, డీఎస్‌వో, మెదక్**

## మున్సిపల్ పారిశుధ్య జవాన్ ఆత్మహత్య



సంజీవ్ (ఫైల్)

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 1: పారిశుధ్య జవాన్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని డంపింగ్ యార్డులో జరిగింది. పట్టణ సీఐ నాగరాజు కథనం ప్రకారం.. పట్టణంలోని 15వ వార్డు పిట్లంబేస్ వీధికి చెందిన సంజీవ్ (38) 13 ఏండ్లుగా మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మూడు నెలలుగా డంపింగ్ యార్డులో విధులు నిర్వహిస్తున్న సంజీవ్ మంగళవారం రాత్రి అదే యార్డులోని షెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం పారిశుధ్య కార్మికులు సంజీవ్ మృతదేహాన్ని చూసి మున్సిపల్ అధికారులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా చేసి, పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సంజీవ్ మృతిపై మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

## పేకాట శిబిరంపై దాడి



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు

తూప్రాన్, జనవరి 1: మున్సిపల్ పరిధిలోని అల్లాపూర్ శివారులో పేకాట శిబిరంపై తూప్రాన్ పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేశారు. అల్లాపూర్ శివారులో రహస్య ప్రదేశంలో పేకాడుతున్నారనే సమాచారం మేరకు సీఐ రంగకృష్ణ, తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. 12 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 12 సెల్‌ఫోన్లు, ఒక ఆటో, రూ. 55,500ల నగదు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలిగించాలి



ప్రమాదకరంగా ఉన్న కరెంటు స్తంభం

చిన్నశంకరంపేట, జనవరి 1: మండలంలోని చందాపూర్‌లో గృహాలకు సరఫరా అయ్యే విద్యుత్ స్తంభం విరిగి ప్రమాదకరంగా మారింది. స్తంభం సగ భాగం విరిగి రోడ్డు వైపు వాలి ఉండడంతో వాహనదారులు, ఆ దారి వెంట వెళ్లడానికి భయపడుతున్నారు. అధికారులు స్పందించి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## పీఏసీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్

రామాయంపేట, జనవరి 1: రామాయంపేట సొసైటీలో చైర్మన్ బాదె చంద్రం నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘ కార్యాలయంలో డైరెక్టర్లతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ సొసైటీ నుంచి అర్హులైన రైతులకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు అందజేస్తామని తెలిపారు. అర్హులైన రైతులు నేరుగా రామాయంపేట ప్రాథమిక సహకార సంఘం కార్యాలయానికి వచ్చి తమ దరఖాస్తులను అందజేయాలన్నారు. ఇప్పటికే రామాయంపేట, నిజాంపేట మండలాల వ్యాప్తంగా కోట్లాది రూపాయల రుణాలను రైతులకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఈవో నర్సింహులు, డైరెక్టర్లు సుధాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నార్సింగి, చిన్నశంకరంపేటలో 20 మందిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు

చేగుంట, జనవరి 1: ఎస్పీ ఉదయ్‌కుమార్ ఆదేశాల మేరకు నార్సింగిలో మంగళవారం రాత్రి డంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 9మందిని పోలీసులు పట్టుకుని, వారిపై కేసులు నమోదు చేసినట్లు నార్సింగి ఎస్ఐ మహ్మద్ మొయినోద్దీన్ బుధవారం తెలిపారు.

### చిన్నశంకరంపేటో...

చిన్నశంకరంపేట, జనవరి 1: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై నారాయణగౌడ్ హెచ్చరించారు. నూతన సంవత్సరం వేడుకల్లో చిన్నశంకరంపేటలో నిర్వహించిన వాహనాల తనిఖీలో మద్యం తాగి వాహనాలు నడిపిన 11 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



చేగుంటలో ఇంటి ఎదుట రంగులతో కొత్త సంవత్సర ముగ్గులు వేస్తున్న యువతులు

## స్థానిక సంస్థల్లో మనదే విజయం

**- ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి**



ఝాన్సీలింగాపూర్‌లో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

రామాయంపేట, జనవరి 1: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించాలని ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఝాన్సీలింగాపూర్ గ్రామంలో సీనియర్ కార్యకర్త, రైతుబంధు మండల మాజీ అధ్యక్షుడు నర్సారెడ్డి గృహ ప్రవేశానికి హాజరై మాట్లాడారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ విజయం వైపు నడవాలన్నారు.

## బీసీ గర్జనను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నాయకులు

మనోహరాబాద్, జనవరి 1: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో ఈ నెల 3 న ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీసీ గర్జనను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దాసరి నరేశ్ ముదిరాజ్ అన్నారు. బుధవారం దండుపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ.. బీసీలపై రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానంపై మండిపడ్డారు. హామీ ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు చేసిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీ మహా గర్జనకు మండలం నుంచి భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు యాదాగౌడ్, మహేశ్ యాదవ్, పంజా భిక్షపతి, రాజు యాదవ్, వెంకటేశ్‌గౌడ్, నాగభూషణం ముదిరాజ్, భిక్షపతి, యాదయ్య యాదవ్, మురళీమోహన్, బాలేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన మెదక్ చర్చి



శిలువను ఊరేగిస్తున్న పాస్టర్లు

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 1: మెదక్ చర్చి బుధవారం భక్తులతో కిటకిటలాడింది. నూతన సంవత్సర తొలి దినంతో కావడంతో భక్తులు, పర్యాటకులు పెద్దఎత్తున తరలివచ్చారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత చర్చిలో ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య నేతృత్వంలో నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం రిటైర్డు బిషప్ కనకప్రసాద్ భక్తులనుద్దేశించి దైవ సందేశం వినిపించారు. ప్రార్థనల్లో ప్రెసిబేటరీ ఇన్‌చార్జీ రెవరెండ్ శాంతయ్య, పాస్టర్లు డేవిడ్ రిచర్డ్స్, శ్రీనివాస్, జైపాల్, చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, ఫ్రాంక్ జాన్సన్, శాంసన్ సందీప్, గెలెన్ చిత్తరంజన్, సువన్‌డగ్లస్ పాల్గొన్నారు.



ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

## ఘనంగా న్యూఇయర్ వేడుకలు

జిల్లా వ్యాప్తంగా మంగళవారం అర్ధరాత్రి నుంచి నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కేకులు కట్‌చేసి ఒకరినొకరు తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. బుధవారం సమీప ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మిఠాయిలు పంచుకున్నారు.

**- న్యూస్ నెట్‌వర్క్, మెదక్**

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**EDUCATION**

★ రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr. JS అకాడమీ (ISO 9001 : 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112

NT-337305-All

**WANTED**

★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.

NT-338992-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

Telangana Today

FOR LOCAL TO GLOBAL NEWS

పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.

ప్రకటనల విభాగం సెల్: 80966 77655

సిద్దిపేట/గజ్వేల్/తూప్రాన్/మెదక్ : 80966 77663

సంగారెడ్డి/జహీరాబాద్/నారాయణఖేడ్ : 9182777658

పటాన్‌చెరు : 80966 77657